సాక్షి
కుమురం భీం

శనివారం। 12 । ఆగస్టు । 2023



ప్రయాణమెలా..?
ఇటీవల వర్షాలకు కెరమెరి మండలంలో గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురయ్యాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 11లో▸

16న ఎంపిక పోటీలు
ఆసిఫాబాద్‌అర్బన్‌: రాష్ట్రస్థాయి సివిల్‌ సర్వీసెస్‌ క్రీడల్లో పాల్గొనేందుకు ఈ నెల 16న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల ఉద్యోగులు తమ పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 80080 90626, 94400 10453 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
33.3 /26.4

వాతావరణం
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చినుకులు పడతాయి.

న్యూస్‌రీల్‌

నేడు కలెక్టరేట్‌ ఎదుట ధర్నా



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఎదుట శనివారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ నూతన పీఆర్సీ కమిషన్‌ వేయాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, సీపీఎస్‌ రద్దు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, వివిధ పేర్లతో పనిచేసే టీచర్లకు కనీస వేతనం చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌ గురుకులాల్లో కేర్‌టేకర్లను నియమించాలని డిమాండ్‌ చేశారు. అన్ని గురుకులాలకు కామన్‌ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సోయం ఇందురావు, ఎల్లయ్య, హేమంత్‌ షిండే, కోట తిరుపతి, ఉపేందర్‌, నవీన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలి



దుకాణాలను పరిశీలిస్తున్న ఆర్‌ఎం

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఆర్టీసీ డిపో పరిధిలోని దుకాణాల్లో వస్తువులను ఎమ్మార్పీకే విక్రయించాలని ఆర్టీసీ ఆర్‌ఎం సోలమన్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో ఉన్న వ్యాపార సముదాయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసిన నేపథ్యంలో కార్మికులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. దుకాణాల్లో అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డిపో మేనేజర్‌ శ్రీధర్‌, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోదకాలు నివారణపై అవగాహన



కెరమెరి పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న సునీల్‌రావు

కెరమెరి(ఆసిఫాబాద్‌): కెరమెరి మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించిన రాష్ట్ర మాస్‌ డ్రగ్‌ అడ్మినిస్ట్రేషన్‌ అధికారి సునీల్‌రావు బోదకాలు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ముందుగా గోయగాం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోదకాలు వ్యాధి వ్యాప్తి, నివారణ మార్గాల గురించి వివరించారు. అనంతరం మోడి హెల్త్‌ వెల్‌నెస్‌ సెంటర్‌, కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. బోదకాలు వ్యాధి నివారణకు వయస్సుకు అనుగుణంగా మాత్రలు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికీ వెళ్లి మాత్రలు అందించి లక్ష్యం చేరుకోవాలన్నారు. వైద్యాధికారి వినోద్‌కుమార్‌, హెచ్‌ఈవో శ్యాంలాల్‌, ఫార్మసిస్ట్‌ ఖలీల్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్‌ ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న సెకండ్‌ ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్‌ డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెకండ్‌ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం గుర్తించని పక్షంలో ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మె ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఎంపీహెచ్‌ఏ పోస్టుల భర్తీకి ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. నాయకులు సత్యనారాయణ, చిరంజీవి, శంకర్‌, సంతోషి, భాగ్య, ప్రమీల, కవిత, వసంత, పద్మ, లీల పాల్గొన్నారు.

ఫలితాల్లో మేటి.. ప్రవేశాలకు పోటీ



కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో గతేడాది ఎంపీసీ చదివిన అమన్‌ 1000 మార్కులకు 990 మార్కులు సాధించాడు. అదే పట్టుదలతో చదివి ఐఐటీ మద్రాస్‌లో సీఎస్‌ఈ బ్రాంచ్‌లో సీటు దక్కించుకున్నాడు.

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో ఫలితాలు
- ప్రవేశాలు పొందేందుకు విద్యార్థుల ఆసక్తి
- ఈ విద్యాసంవత్సరంలో 96 శాతం నిండిన సీట్లు



ఆసిఫాబాద్‌లో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు ప్రవేశాలు, ఫలితాల్లో ప్రైవేట్‌కు దీటుగా నిలుస్తున్నాయి. ఏటా మెరుగైన ఉత్తీర్ణతతో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తుండటంతో గవర్నమెంట్‌ కాలేజీల్లో సీట్లకు డిమాండ్‌ పెరుగుతోంది.

96శాతం ప్రవేశాలు పూర్తి..

జిల్లాలో మొత్తం 30 ప్రభుత్వ రంగ కళాశాలలు, 6 ప్రైవేట్‌ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 11 ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు కొన్నేళ్లుగా ప్రైవేట్‌ను మించి ఉత్తీర్ణత శాతం నమోదు చేస్తున్నాయి. అలాగే పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారు. కుమురంభీం జిల్లా వార్షిక ఫలితాల్లో మూడేళ్లుగా టాప్‌ త్రీలో నిలుస్తోంది. దీంతో చాలా మంది తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు. 11 గవర్నమెంట్‌ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో 28,30 సీట్లు అందుబాటులో ఉండగా ఇప్పటికే 2,702 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఉచిత చదువు, పాఠ్యపుస్తకాలతోపాటు పరీక్షలకు కొన్నినెలల ముందు నుంచి స్థానిక ఎమ్మెల్యేలు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉండటం కలిసివస్తోంది. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. బోర్డు ఆదేశాలకు అనుగుణంగా సిలబస్‌ పూర్తి చేస్తున్నారు.

మూడేళ్లుగా ఇదే జోరు..

ప్రైవేట్‌, గురుకులాలు, కేజీబీవీలు పెరగడంతోపాటు విద్యార్థులు ఐటీఐ వంటి సాంకేతిక విద్య వైపు అడుగులు వేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో ప్రవేశాలు ఏటా తగ్గుతున్నాయి. కానీ కుమురంభీం జిల్లాలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో మూడేళ్లుగా ప్రవేశాల జోరు కొనసాగుతోంది. 2021- 22 విద్యా సంవత్సరంలో ఇంటర్‌ మొదటి సంవత్సరంలో 2,514 మంది విద్యార్థులు ప్రవేశాల తీసుకున్నారు. 2022- 23 విద్యాసంవత్సరంలో 2,560 మంది, 2023- 24 విద్యాసంవత్సరంలో 2,702 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశాల గడువు పొడిగించింది. అడ్మిషన్లకు మరో పదిరోజుల గడువు ఉండటంతో ప్రవేశాలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రవేశాలతోపాటు కాలేజీలు ఫలితాల్లో మెరుగ్గా నిలుస్తున్నాయి. 2019- 20లో 72 శాతం, 2020- 21లో వంద శాతం, 2021- 22లో 76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2022- 23 సెకండియర్‌ ఫలితాల్లో 81 శాతంతో రాష్ట్రంలో ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. ఆదివాసీ కుటుంబాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలు వరంగా మారాయి.

మెరుగైన విద్య



జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య అందుతోంది. గతేడాది కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్‌ పూర్తి చేశా. అక్కడ నేర్చుకున్న విషయ పరిజ్ఞానంతోనే ఐఐటీలో సీటు వచ్చింది. అమరావతిలోని వెల్లూర్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీలో సీఎస్‌ఈ బ్రాంచ్‌లో చేరా.

– పల్లవి, కాగజ్‌నగర్‌

అగ్రస్థానంలో జిల్లా

ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఐదు సంవత్సరాల నుంచి ఇంటర్‌ ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉంటుంది. ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నిష్ణాతులైన అధ్యాపకుల కృషితో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

– శ్రీధర్‌సుమన్‌, డీఐఈవో

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే
- జేపీఎస్‌లకు రెగ్యులరైజ్‌ ఆర్డర్‌ కాపీలు అందజేత



కార్యదర్శికి ఉత్తర్వు అందిస్తున్న కలెక్టర్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌: ప్రభుత్వ ఉద్యోగులు తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌ చాంబర్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి 13 మంది జూనియ ర్‌ పంచాయతీ కార్యదర్శులకు సర్వీసు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్‌ కోసం అదనపు కలెక్టర్‌, ఎస్పీ, జిల్లా అటవీశాఖ అధికారులతో నియమించిన పెర్ఫామెన్స్‌ కమిటీ గ్రామ పంచాయతీల్లో పర్యటించిందన్నారు. పనితీరు, గ్రామాల్లో మౌలిక వసతులను పరిశీలించి 70 శాతం మార్కులు వచ్చిన జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల సర్వీసు క్రమబద్ధీకరణకు సిఫారసు చేశారని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కుమురంభీం మనుమడు సోనేరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

94కు చేరిన దరఖాస్తులు

ఆసిఫాబాద్‌: జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణ కోసం శుక్రవారం 69 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్‌ అధికారి జ్యోతికిరణ్‌ తెలిపారు. ఆసిఫాబాద్‌ డివిజన్‌లో 44 దరఖాస్తులు రాగా, కాగజ్‌నగర్‌ డివిజన్‌లో 25 వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 94కు చేరింది.

విద్యార్థులకు వర్క్‌బుక్స్‌

- 1 నుంచి 5 తరగతుల వారికి అందజేత
- ప్రాథమిక స్థాయిలోనే విద్యాసామర్థ్యాల పెంపునకు చర్యలు
- జిల్లాలో 500 ప్రాథమిక, 103 ప్రాథమికోన్నత పాఠశాలలు



కెరమెరిలో వర్క్‌బుక్స్‌ పంపిణీ చేస్తున్న ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్‌

కెరమెరి(ఆసిఫాబాద్‌): ప్రాథమిక స్థాయి నుంచి చిన్నారుల్లో విద్యాసామర్థ్యాల పెంపునకు విద్యాశాఖ కృషి చేస్తోంది. మారుతున్న కాలనుగుణంగా బోధన విధాన విధానాలను మార్చేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఇటీవల ఆరు రోజులపాటు ఎఫ్‌ఎల్‌ఎన్‌(ఫౌండేషన్‌, లిటరసీ, న్యూమరసీ) కార్యక్రమంలో భాగంగా టీచర్లకు అవగాహన తరగతులు నిర్వహించారు. అంతేకాక 2023- 24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు వర్క్‌బుక్స్‌ అందిస్తున్నారు.

ప్రాథమిక విద్య బలోపేతం..

ప్రాథమిక దశలోనే విద్యాపునాది పటిష్టంగా ఉంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. కాలం చెల్లిన బోధనా విధానాలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ ప్రపంచంలో నెగ్గుకురాలేరు. దీనిని గుర్తించిన ప్రభుత్వం గతేడాది నుంచి తొలిమెట్టు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు అభ్యసన పుస్తకాలు(వర్క్‌బుక్స్‌), కథల పుస్తకాలు అందిస్తోంది. వీటి ద్వారా 5+1 విధానంలో బోధించనున్నారు. ఈ విధానం ఇప్పటికే లోకల్‌ బాడి పాఠశాలల్లో ప్రారంభమైంది.

బోధన ఇలా..

జిల్లాలో మొత్తం 500 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 103 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు సాధారణంగా ఒక విద్యా సంవత్సరంలో సరాసరి 220 పనిదినాలు ఉంటాయి. ఇందులో 140 రోజులు పాఠ్యాంశాల బోధనకు సరిపోతాయని నిపుణులు చెబుతున్నారు. మిగిలిన రోజుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృత్యాధారణ బోధన చేపట్టాలని విద్యాశాఖ వర్క్‌బుక్స్‌ అందిస్తోంది. 5+1 బోధన అంటే.. వారంలో ఐదు రోజులు తరగతులు, ఒకరోజు అభ్యసనాలు చేయించడం ఉంటుంది. తెలుగు, ఇంగ్లిష్‌, గణితం సబ్జెక్టులకు 90 నిమిషాల సమయం ఉంటే, అందులో 40 నిమిషాలు విద్యార్థులను ఆకట్టుకునేలా పాఠం బోధించాలి. ఆ తర్వాత 15 నిమిషాలు వర్క్‌బుక్‌ రాయించాలి. అలాగే మరో 15 నిమిషాలపాటు విద్యార్థులకు ఆసక్తి కలిగే కథ చెప్పాల్సి ఉంటుంది. ఏ రోజు చెప్పిన పాఠం ఆరోజే విద్యార్థులతో వర్క్‌బుక్‌ రాయించాలి.

గ్రూపులుగా విభజన..

తరగతిలోని విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజిస్తారు. ఫార్మార్మర్‌, మీడియం, టీచర్‌ సపోర్ట్‌ అనే గ్రూపులు ఏర్పాటు చేశారు. విద్యార్థులందరూ ఫార్మర్మర్‌ గ్రూపులోకి వచ్చేలా గుణాత్మకంగా కృత్యాధార బోధన చేయాలి. అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాల్సి ఉంటుంది. గతంలో పాఠ్యప్రణాళికలు రూపొందించుకుని రెండు ఫార్మటివ్‌ అసెస్‌మెంట్‌, నాలుగు సమ్మెటివ్‌ అసెస్‌మెంట్‌ పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం ప్రతీవారం పాఠ్యాంశాలకు సంబంధించిన సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

మెరుగైన ఫలితాలు



ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాల పెంపునకు వర్క్‌బుక్స్‌ ఎంతో దోహదపడతాయి. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నూతన విద్యావిధానం పక్కాగా అమలు చేయడం ద్వారా అభ్యసన సామర్థ్యాలు పెరిగి మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ఈ ఏడాది తొలిమెట్టు కార్యక్రమంలో మార్పులు చేసి ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నాం.

– రాథోడ్‌ సుభాష్‌, సెక్టోరియల్‌ అధికారి

దేశీదారు.. ‘మహా’ జోరు!

- మొన్న సిర్పూర్‌(టి).. నిన్న కాగజ్‌నగర్‌లో పట్టివేత
- విచ్చలవిడిగా బెల్టు దుకాణాల్లో విక్రయాలు
- అడ్డదారుల్లో మహారాష్ట్ర నుంచి జిల్లాకు రవాణా

కాగజ్‌నగర్‌ పట్టణంలోని రైల్వేస్టేషన్‌ రోడ్డులో రెండు స్కూటీలపై చంద్రపూర్‌కు చెందిన వ్యక్తులు మహారాష్ట్ర నుంచి అనుమతి లేకుండా అక్రమంగా దేశీదారు మద్యం తరలిస్తుండగా శుక్రవారం ఉదయం పెట్రోలింగ్‌ విధుల్లో ఉన్న పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 1,150 సీసాల విలువ రూ.40 వేలు ఉంటుంది.

సిర్పూర్‌(టి) మండలంలోని టోంకిని గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.6 వేల విలువైన 120 దేశీదారు మద్యం సీసాలను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా తరచూ దేశీదారు మద్యం పట్టుబడుతుంది. అంతేకాక పోలీసుల కళ్లు కప్పి పలుమార్గాల్లో భారీగా సరిహద్దు దాటుతోంది.



సిర్పూర్‌(టి)లో పోలీసులు స్వాధీనం చేసుకున్న దేశీదారు మద్యం

కౌటాల(సిర్పూర్‌): మహారాష్ట్ర మద్యం జిల్లాలో ఏరులై పారుతోంది. అక్రమంగా జిల్లాలోని చేరుతున్న మద్యాన్ని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్‌, ఇతర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఓ పక్క రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు టెండర్లు నిర్వహిస్తోంది. ఈ తరుణంలో దేశీదారు రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

లాభం ఎక్కువ..

రాష్ట్ర ప్రభుత్వం గుడుంబాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంతో పలువురు వ్యాపారుల చూపు సరిహద్దులోని మహారాష్ట్రలో చౌక ధరకు లభించే దేశీదారు మద్యంపై పడింది. పెన్‌గంగ, వార్ధా, ప్రాణహిత నదుల పరీవాహక గ్రామాలను అడ్డాగా చేసుకుని దందా సాగిస్తున్నారు. వాంకిడి, సిర్పూర్‌(టి), చింతలమానెపల్లి మండలాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా రవాణా ఆగడం లేదు. తెలంగాణ మద్యం అమ్మకాలతో పోల్చితే తక్కువ ధరకు లభించే దేశీదారుతో వ్యాపారులకు లాభాలు ఎక్కువగా వస్తున్నాయి. 48 సీసాలతో ఉండే ఒక్కో దేశీదారు మద్యం పెట్టె రూ.3,840 ఉంటుంది. సీసాకు రూ.80 ఉండగా జిల్లాలో రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. ఖర్చులు పోను వ్యాపారులకు ఒక్కో పెట్టెపై రూ.1500 వరకు లాభం మిగులుతోంది. జిల్లాలో రోజుకి సుమారు 300 వరకు పెట్టెల వరకు విక్రయం జరుగుతుందని అంచనా. ఈ లెక్కన నెలకు రూ.1.35 కోట్లు, ఏడాదికి రూ.16.20 కోట్లకు పైచిలుకు వ్యాపారం సాగుతుందని తెలుస్తోంది.

నిఘా కళ్లు గప్పి..

ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ సర్కిళ్ల పరిధిలో 32 మద్యం దుకాణాలు, మూడు బార్లు ఉన్నాయి. ఏటా రూ.250 కోట్ల వరకు సరుకు అమ్ముడవుతుందని ఎక్సైజ్‌ అధికారులు చెబుతున్నారు. 2020లో మహారాష్ట్ర ప్రభుత్వం చంద్రాపూర్‌ జిల్లాలో మద్యపాన నిషేధం ఎత్తివేసింది. అప్పటి నుంచి అక్కడ దేశీదారు అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ధర తక్కువ కావడంతో ప్రజలు దేశీదారుకు అలవాటు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి, గుండాయిపేట్‌, వీర్దండి, తాటిపల్లి, సాండ్‌గాం, వీరవెల్లి, చింతలమానెపల్లి మండలం రణవెల్లి, దిందా, గూడెం, బెజ్జూర్‌ మండలం సోమిని, తలాయి గ్రామాలకు సమీపంలోని ప్రాణహిత, వార్ధా నదుల్లో పడవ ద్వారా మహా రాష్ట్ర నుంచి మద్యం సరఫరా ఎక్కువగా ఉంటుంది. అక్కడి నుంచి పట్టణాలకు చేరుస్తారు. అలాగే కొందరు రాజురా నుంచి ప్రైవేట్‌ వాహనాల్లో వాంకిడి మీదుగా జిల్లాకు తరలిస్తున్నారు. అమ్మకాలు బాహాటంగానే జరుగుతున్నా అధికారులు అడపాదడపా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు పటిష్టమైనా నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎండీఏ సర్వే నుంచి మినహాయించాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్‌: ఎండీఏ సర్వే నుంచి తమను మినహాయించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా సంక్షేమ అధికారి సావిత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.వనిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక విద్యాకేంద్రాలుగా కొనసాగుతున్నాయని, జాబ్‌చార్ట్‌ ప్రకారమే తాము విధులు నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 25 వరకు ఎండీఏ సర్వే చేయాలని అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్‌ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన సర్వేను తమతో చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌, నాయకులు సువర్ణ తదితరులు ఉన్నారు.

కాలినడకన వెళ్లి.. సమస్యలు తెలుసుకుని

- గుండాల గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో రామకృష్ణ



గుండాలకు వెళ్తున్న డీఎంహెచ్‌వో, వైద్యసిబ్బంది



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

తిర్యాణి(ఆసిఫాబాద్‌): సరైన రోడ్డు సౌకర్యం లేని తిర్యాణి మండలంలోని గుండాల గ్రామాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో రామకృష్ణ సందర్శించారు. రొంపెల్లి నుంచి వైద్యసిబ్బందితో కలిసి ఐదు కిలోమీటర్ల దూరం నడిచి గుండాలకు చేరుకున్నారు. అక్కడి ప్రజలకు అందుతున్న వైద్యసేవల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మారుమూల గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు చిన్న చిన్న వ్యాధులకు చికిత్స అందించేందుకు వారికి తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవమయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సబ్‌సెంటర్‌ పనులు త్వరగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు రొంపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యులు సిద్దార్థ, హర్షవర్ధన్‌, ప్రియాంక, డీపీవో ధరమ్‌సింగ్‌, మీడియా అధికారి రషీద్‌ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

స్వాతంత్ర్య సమరయోధుడు చొక్కారెడ్డి కన్నుమూత


బద్దం చొక్కారెడ్డి (ఫైల్)

మందమర్రిరూరల్: మండలంలోని అందుగలపేట గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు బద్దం చొక్కారెడ్డి (97) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. చొక్కారెడ్డి నిజాం కాలంలో తెలుగు ప్రజలపై జరుగుతున్న అరాచకాలను అప్పటి కాంగ్రెస్ నాయకుడు కేశవరావు నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లి అప్పటి హోంమంత్రి సర్దార్ వల్ల భాయ్ పటేల్‌కు వివరించారు. వెంటనే పటేల్ మిలిటరీని తెలంగాణకు పంపించి అరాచకాలను అణిచివేశారు. చొక్కారెడ్డి భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు నలుగురు కూతుళ్లు, కుమారుడు వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కోర్టు కేసులపై సమీక్ష


సమావేశంలో డీజీఎం, అధికారులు

నస్పూర్: సింగరేణి సంస్థలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించిన వివరాలపై డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా ఎస్.బలరాం, జనరల్ మేనేజర్ పర్సనల్ హనుమంతరావు అన్ని ఏరియాల పర్సనల్, లా విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ.. న్యాయ స్థానంలో ఉన్న కేసులకు సంబంధించిన అన్ని వివరాలను సంస్థ తరఫున న్యాయ స్థానాలకు అందించాలని అధికారులకు సూచించారు. డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీవైపీఎంలు ఎస్వీ రాజేశ్వర్‌రావు, వీ దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సంక్షేమాధికారులు సునీల్, రణదీప్ గౌడ్, గౌస్ పాషా, సంతన్ పాల్గొన్నారు.

14న నేషనల్ అప్రెంటిషిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14వ తేదీన నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్-50 ఖాళీలు, మెషినిస్టు-10, టర్నర్ ట్రేడ్‌లో 10 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. వీఎల్‌ఆర్ ఫెసిలిటేటర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఎలక్ట్రీషియన్-40, ఫిట్టర్-60, వెల్డర్-60, మెకానిక్ డీజిల్-30 ఖాళీలున్నట్లు తెలిపారు. ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్-50 ఖాళీలు, ఐటీసీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, మెదక్‌లో (మహిళలకు) కోపా-30 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. ఆయా సంస్థల్లో 370 ఖాళీలున్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్సెస్సీ, ఐటీఐ మెమోలతో ఎన్టీసీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్, రెండు ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు.

ప్లాంటేషన్ పనులకు వెళ్లిన మహిళను కాటేసిన పాము

చింతలమానెపల్లి: మండలంలోని అడెపల్లి గ్రామం వద్ద అటవీశాఖ ప్లాంటేషన్‌లో పనిచేస్తున్న మహిళ శుక్రవారం పాముకాటుకు గురైంది. మండలంలోని డబ్బా సెక్షన్‌లోని అడెపల్లి బీట్ అటవీభూమిలో ప్లాంటేషన్ పనులు చేపట్టగా మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలు హాజరయ్యారు. పనులు చేస్తుండగా ఓ మహిళను పాము కాటేసింది. దీంతో అటవీశాఖకు చెందిన వాహనంలో ఆమెను కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు సెక్షన్ అధికారి సంతోష్ తెలిపారు. మహిళకు సంబంధించిన వివరాలు తమ దగ్గర లేవని ఆయన వివరించారు.

పత్తికి సూక్ష్మ పోషకాలు తప్పనిసరి

- చెన్నూర్ ఏడీఏ జాడి బాపు

చెన్నూర్‌రూరల్: పత్తి పంటకు అందించే ప్రధాన మూలకాలు లేదా పోషకాలు నత్రజని (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్), పాస్ఫరస్ (పీ) (సింగిల్ పాస్ఫేట్, డీఏపీ, కాంప్లెక్స్), పొటాష్ (మ్యూరేట్ ఆఫ్ పొటాష్, మల్టికె, కాంప్లెక్స్)తో పాటు మొక్కల ఎదుగుదల, కాయల అభివృద్ధి, పత్తి నాణ్యత, దిగుబడి పెరగడానికి, జింక్, బోరాన్, మెగ్నీషియం లాంటి సూక్ష్మ పోషకాలు అవసరమని చెన్నూర్ ఏడీఏ జాడి బాపు సూచించారు. ఆయన చేస్తున్న మరిన్ని సూచనలు..

జింక్: విత్తిన మూడు వారాల తర్వాత పత్తిలో జింక్ లోపం కనబడుతుంది. ఇది ఎక్కువగా మొక్క మధ్య ఆకుల మీద కనిపిస్తుంది. ఆకుల ఈనెలు, ఆకు పచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. గోధుమరంగు మచ్చలు ఆకుల చివర్ల నుంచి మొదలుకు వ్యాపిస్తాయి. ఆకు చివర్లు ఎండిపోతాయి. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి ముడతలు పడి కణుపుల మధ్యదూరం తగ్గి పోతుంది. మొక్కలు చిన్నవిగా గుబురుగా కనబడుతాయి.

నివారణ చర్యలు: జింక్ లోపం లేకుండా ఉండేందుకు ఆఖరి దమ్ములో ఎకరాకు 20కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి.


జింక్ లోపంతో గోధుమ వర్ణంలో పత్తి ఆకులు


బోరాన్ లోపంతో పత్తి ఆకులు ఇలా..

బోరాన్: మొక్క జీవనక్రియలో బోరాన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. మొక్కలో సున్నం, పొటాష్ పోషకాలను క్రమబద్ధీకరిస్తుంది. మొక్క సున్నాన్ని సక్రమంగా వినియోగించుకోవడానికి బోరాన్ అవసరం ఉంటుంది. సున్నం పాటు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షపాతం ఉన్నప్పుడు ఈ లోపం కనిపిస్తుంది. ఆకులు, కాడలు ఒకే రీతిలో ఉండకుండా కొంత దళసరిగా, కొంత పలుచగా ఉండి అక్కడక్కడా గుండ్రటి మచ్చలు ఏర్పడతాయి. పూత, మొగ్గ దశలో ఎండి పోవడం, చిన్నకాయలు రాలి పోవడం మొక్కలు గిడసబారి మొదలుపై పగుళ్లు ఏర్పడతాయి. కాండం సరిగా అభివృద్ధి చెందక ఆకారం కోల్పోయి, నిలువుగా పగుళ్లు ఏర్పడతాయి.


జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

నివారణ చర్యలు: బోరాన్ లోపించకుండా ఉండేందుకు ఎకరాకు నాలుగు కిలోల బోరాక్స్‌ను దుక్కిలో వేయాలి. బోరాన్ లోపం మొక్కలపై కనిపిస్తే పైరు విత్తిన 60, 90 రోజుల తర్వాత లీటర్ నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ వారం వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి.

మెగ్నీషియం: ఈ దాతువు యొక్క లోపం ఎక్కువగా సున్నపు నేలలు, పొటాష్ ఎక్కువగా ఉన్న నేలల్లో పండించే పంటలో కనబడుతుంది. మెగ్నీషియం లోపం పత్తి పంటలో ఎక్కువగా కనిపిస్తుంది. మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు ముదురుఆకులు అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగులోకి మారుతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి.

నివారణ చర్యలు: మెగ్నీషియం లోపిస్తే లీటర్ నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి 45, 75 రోజులకోసారి పిచికారీ చేయాలి. ప్రధాన పోషకాలు నత్రజని, పాస్ఫరస్, పొటాష్‌ను రైతులు ఏదో ఒక రూపంలో అందించాల్సిన దాని కంటే ఎక్కువ మోతాదులో వాడుతున్నారు. ఈ సూక్ష్మ పోషకాల ఆవశ్యకత తెలియక వాటిని వాడడం లేదు. అందుకే రైతులు సూక్ష్మ పోషకాలకు సంబంధించిన లక్షణాలు ఉండే పురుగుమందులు వాడుతుంటారు. రైతులు వారిస్థాయిలో లోపాల లక్షణాలను గుర్తించి అన్ని ఎరువులు సమపాళ్లలో వాడుకోవాలి. దీంతో పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుంది.

టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: సింగరేణి ఆస్తుల పరిరక్షణ కోసం యాజమాన్యం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించాలని టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసారపు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఏరియాలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు సింగరేణి ఆస్తులు దోచుకుంటున్నా సింగరేణి యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నోరు మెదపడం లేదని ఆరోపించారు. మందమర్రి ఏరియాలో కార్మికులకు నివాస యోగ్యంగా ఉన్న క్వార్టర్లను గుర్తించిన తర్వాతే డిజిటలైజేషన్ చేయాలని కోరారు. మిగులు క్వార్టర్లను కబ్జాకు గురికాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు నిబంధనల ప్రకారం కేటాయించాలన్నారు. అక్రమ నిర్మాణాలకు తావివ్వకుండా ప్రజలు, ఉద్యోగులను భాగస్వాములను చేసి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మొదటి జూన్‌లో ఇటీవల అక్రమ నిర్మాణం చేస్తున్నారని రమేశ్ అనే వ్యక్తి అక్కడ లేకుండానే ఫిర్యాదు చేయడంపై అనుమానం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాన్ని స్వాధీనం చేసుకోవాలని, నిర్మాణదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు శ్రావణ్, సాయికుమార్, లింగం, నవీన్, రాకేశ్, భాస్కర్, మహేశ్ ఉన్నారు.

గూడెం గుట్టల్లో అక్రమ తవ్వకాలు!


తవ్వకాలు జరిపిన ప్రదేశం

- పేలుళ్లతో భయాందోళనలో గ్రామస్తులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ సమీపంలోని గుట్టల్లో మొరం అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్ శాఖలనుంచి ఎలాంటి అనుమతి లేకుండానే కొందరు తవ్వకాలు చేపడుతున్నారు. గూడెం గుట్టల్లో కొంత భాగం తవ్వకాలకు అనుమతి ఉండగా, మిగతా చోట్ల అనుమతి లేనప్పటికీ జేసీబీలతో దర్జాగా తవ్వకాలు కొనసాగిస్తున్నారు. అక్రమ తవ్వకాలతో గూడెం గుట్టలు కనుమరుగవుతున్నాయి. స్థానికంగా ఉండే కొందరు రాత్రి, పగలూ తేడా లేకుండా తవ్వకాలు చేపట్టి టిప్పర్లలో మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌లకు పాల్పడుతుండగా సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ మొరం తవ్వకాలు, బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలని కోరుతున్నారు.

ఎలాంటి అనుమతులు లేవు

గూడెం గుట్టల్లో క్వారీ తవ్వకాలకు మాత్రమే అనుమతులున్నాయి. మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు ఇటీవలే మా దృష్టికి వచ్చింది. మా సిబ్బందితో పర్యవేక్షిస్తున్నాం. మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అనుమతులు లేకుండా మొరం, క్వారీ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు.

– బాలు, మైనింగ్ ఏడీ

తహసీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

దండేపల్లి మండలంలోని గూడెం గుట్టల్లో అక్రమంగా, క్వారీ, మొరం తవ్వకాలు జరపడంతోపాటు బ్లాస్టింగ్ చేస్తున్నారని స్థానికులు తహసీల్దార్ సంధ్యారాణికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. బ్లాస్టింగ్‌లు చేపట్టడంతో సమీపంలోని తమ పొలాలకు వెళ్లలేకపోతున్నామని తెలిపారు. వెంటనే అక్రమ తవ్వకాలు, బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దమ్మ సృజన్, సునీల్, మాజీ జెడ్పీటీసీ మంద రాజయ్య, స్థానికులున్నారు.

అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో బుద్దే స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న దేశీదారును పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌హెచ్‌వో బుద్దే స్వామి శుక్రవారం కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై కళ్యాణ్ సిబ్బందితో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం రైల్వేస్టేషన్ రోడ్డులో రెండు ద్విచక్రవాహనాల్లో చంద్రపూర్‌కు చెందిన అజయ్‌కుమార్, రోహిత్, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విశాల్, ఆకాష్ మహారాష్ట్ర నుంచి అక్రమంగా 1150 దేశీదారు సీసాలు తీసుకువస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40,250 ఉంటుందని పేర్కొన్నారు. నాటుసారా, గుడుంబా, దేశీదారు, గంజాయి ఇతర మత్తుపానీయాలు అమ్మినా, తయారు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశీదారు తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్



మందమర్రిరూరల్: మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ అంతరాయమేర్పడింది. రైల్వే గేటు సమీపంలో వెదురు బొంగులతో వెళ్లే లారీ రోడ్డుపై నిలిచిపోగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. ట్రాఫిక్‌లో మూడు అంబులెన్స్‌లు కూడా చిక్కుకుపోయాయి. మందమర్రి పోలీసులు వెంటనే అక్కడకు వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పంచాయతీ ట్రాక్టర్‌ను లాక్కెళ్లిన కాంట్రాక్టర్

- సీసీ రోడ్డు బిల్లు చెల్లించకపోవడంతోనే..

బెజ్జూర్: సీసీ రోడ్డు పనులు చేసి నెలలు గడిచినా బిల్లు రాకపోవడంతో ఓ కాంట్రాక్టర్ ఏకంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను లాక్కెళ్లిన ఘటన మండలంలోని లంబాడిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. లంబాడిగూడ గ్రామపంచాయతీకి చెందిన ముడిమడుగుల పెంటయ్య కొద్దినెలల క్రితం దాదాపు రూ.5 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మించాడు. మూడు నెలలవుతున్నా బిల్లు రాలేదు. పలుసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను గురువారం లాక్కెళ్లి ఇంటి ముందు పెట్టుకున్నాడు. బిల్లు చెల్లించేదాకా ట్రాక్టర్‌ను ఇచ్చేది లేదని చెబుతున్నాడు. తాను నిర్మించిన సీసీ రోడ్డు బిల్లు సర్పంచ్ ఖాతాలో జమ కాగా తనకు ఇవ్వడంలేదని ఆరోపించాడు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నాడు.


కాంట్రాక్టర్ ఇంటి వద్ద గ్రామపంచాయతీ ట్రాక్టర్

శరణ్య హంతకుడెవరు?

మంచిర్యాలక్రైం: ఈ నెల 10న జిల్లా కేంద్రంలో బత్తిని శరణ్య (27)ను అతి కిరాతకంగా హత్య చేసేంది ఎవరనేది మిస్టరీగా మిగిలింది. హత్య జరిగిన 24గంటల వరకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. పక్కా పథకం ప్రకారమే హత్య చేసి ఆధారాలు దొరకకుండా చేశారు. కుటుంబ సభ్యులు మాత్రం మృతురాలి భర్త సయ్యద్ జియా ఉల్ హక్ మరొకరి సాయంతో హత్య చేశాడని ఆరోపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సయ్యద్ కోసం వేట మొదలుపెట్టారు. సయ్యద్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా చెన్నై ప్రాంతంలోని మధురైలో విధులు నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు ప్రత్యేక పోలీస్ టీమ్ అక్కడికి బయలుదేరినట్లు సమాచారం. కాగా, స్థానికంగా అనుమానితులను కొందరిని విచారిస్తున్నట్లు తెలిసింది. శరణ్య హత్యకు ఎవరు సహకరించి ఉంటారనే కోణంలో విచారణ చేస్తున్నారు. భర్తనే హత్య చేశాడా? లేక ఎవరికైనా సుపారీ ఇచ్చి హత్య చేయించాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. మృతురాలి కాల్ డాటా ఆధారంగా కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉంది. ఏది ఏమైనా మహిళ హత్య కేసు ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

మందమర్రిరూరల్: ఈ నెల 9న మందమర్రి పట్టణంలోని ఒర్రెగడ్డ ఏరియాలో జరిగిన గుంటి మాధవి హత్య కేసులో ఆమె భర్త దేవేందర్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి మండలం మాల గురిజాలకు చెందిన మాధవి 2007లో మొదటి భర్తను విడిచి మందమర్రికి చెందిన దేవేందర్‌ను రెండో వివాహం చేసుకుంది. తాగుడుకు బానిసైన దేవేందర్ మద్యం మత్తులో మాధవిని కొట్టి చంపాడని ఆమె మొదటి భర్త కుమారుడు అమర్‌నాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేశామని ఏసీపీ తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సీఆర్టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని టీఎస్‌టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమకు వినతిపత్రం అందించారు. నెలలకొద్దీ వేతనాలు పెండింగ్‌లో ఉంచడం వల్ల సీఆర్టీల కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతీ నెలకు సంబంధించిన వేతనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొల్ల రామన్న, కార్యదర్శి గుర్రాల రాజావేణు, ఉపాధ్యక్షురాలు ఎస్.లావణ్య పాల్గొన్నారు.

నీటి మడుగులో పడి యువకుడి మృతి


ప్రవీణ్ (ఫైల్)

రెబ్బెన: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన జె.ప్రవీణ్(18) శుక్రవారం ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి మృతిచెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెల కాపరి ప్రవీణ్ రోజు మాదిరిగానే లక్ష్మీపూర్ వాగు పరిసరాల్లో గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. కొన్ని గొర్రెలు నీటిమడుగులోకి వెళ్లడంతో వాటిని బయటకు తోలేందుకు దిగి ప్రమాదవశాత్తు అందులోనే మునిగిపోయాడు. సమీపంలో ఉన్న మరో గొర్రెల కాపరి గమనించాడు. గ్రామస్తుల సహాయంతో బయటకు తీసి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే చనిపోయాడు. సంఘటన స్థలాన్ని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ కోలే శ్యాంరావు పరిశీలించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మంచిర్యాల టికెట్ బీసీలకే కేటాయించాలి


సమావేశంలో ఐక్యత చాటుతున్న ఆశావహులు

నస్పూర్: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ బీసీలకే కేటాయించాలని పలువురు బీసీ ఆశావహ అభ్యర్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న బీసీ సామాజికవర్గ అభ్యర్థులకే అన్ని ప్రధాన పార్టీలు టికెట్ కేటాయించాలని కోరారు. ఏ పార్టీ టికెట్ కేటాయించినా పార్టీలకు అతీతంగా గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఏ పార్టీ టికెట్ కేటాయించని పక్షంలో తమలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో నస్పూర్, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్లు తోట శ్రీనివాస్, గాజుల ముఖేశ్‌గౌడ్, మంచిర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేశ్, నస్పూర్ మాజీ జెడ్పీటీసీ రాచకొండ ఆశాలత, డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్, డాక్టర్ రమణ, బీసీ జిల్లా జాగృతి అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, నాయకులు తులా మధసూదన్‌రావు, విష్ణువర్ధన్‌రావు, దొమ్మటి అర్జున్, వెంకటేశ్వర్‌రావు, రంగు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు మారిన సంక్షేమశాఖ కార్యాలయం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా నిర్వహిస్తున్న మహిళా, శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సమీకృత కలెక్టరేట్‌లోకి శుక్రవారం మార్చారు. గదిలో పూజలు నిర్వహించి పాత కార్యాలయంలోని సామగ్రి, కంప్యూటర్లను తరలించి సేవలు ప్రారంభించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కె.రఘువీర్, పోషణ అభియాన్ టీం రజిత, చైల్డ్‌లైన్ సత్యనారాయణ, డీఈవో రాజ్యలక్ష్మి, ఎఫ్ఆర్‌వో ఫర్జాన, లక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు కన్నాల చౌరస్తా హన్మాన్ విగ్రహం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసే విషయంలో ఘర్షణపడి ఇద్దరు బీఎస్పీ నాయకులపై దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్సై విక్టర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లపల్లి వరప్రసాద్ పార్టీ ప్రచారం కోసం హన్మాన్ విగ్రహ ప్రాంతంలో మున్సిపాలిటీకి రుసుం చెల్లించి ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నాడు. ఇదే ఫ్లెక్సీపై బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణాధ్యక్షుడు సన్నీబాబు మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. దీంతో సన్నీబాబు అతడి అనుచరులు మరో 20మంది వరప్రసాద్, జాడి సాగర్‌పై దాడి చేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

కోటపల్లి: మండలంలోని శంకరాపూర్ గ్రామానికి చెందిన సూరం రాంరెడ్డి అనే వ్యక్తి దుర్గం బాపును కొట్టి కట్టేసి కులం పేరుతో దూషించినందుకు బాధితుడి ఫిర్యాదు మేరకు అతడిపై అట్రాసిటీ, వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. దుర్గం బాపు ఎడ్లు రాంరెడ్డి పెరటిలోని మొక్కజొన్న కర్రలు తిన్నందునా అతడిని ఇంటి నుంచి లాక్కొచ్చి బూతులు తిడుతూ తన ఇంటి వద్ద కట్టివేశాడని పేర్కొన్నారు. గ్రామస్తులు సర్దిచెప్పడంతో బాపును విడిచిపెట్టినట్లు వివరించారు. ఏసీపీ మోహన్, ఎస్సై సురేశ్ సమగ్ర విచారణ జరిపి నేరం రుజువైనందున రాంరెడ్డిపై 73/23, 342, 324,290, ఐపీసీ 3(1), 3(2) ఎస్సీ యాక్ట్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రతీనెల 30వ తేదీన ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సివిల్ రైట్స్‌డే నిర్వహించి ప్రజలకు కులవివక్ష, చట్టాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎదుటివారి హక్కులకు భంగం కలిగించినా, కుల వివక్ష చూపినా, ఇందుకు సహకరించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

దళితులపై దాడులు పునరావృత్తం కాకుండా చూడాలి


బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

కోటపల్లి: దళితులపై దాడులు పునరావృత్తం కాకుండా చూడాలని దళితసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శెట్‌పల్లి గ్రామంలో దళితుడు దుర్గం బాపుపై దాడికి నిరసనగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేశ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు జిల్లపెల్లి వెంకటేశం, ఎమ్మార్పీఎస్ నాయకులు, నేతకాని సంఘం నాయకులు దుర్గం అశోక్, దుర్గం రాజేశ్ వేర్వేరుగా పరామర్శించారు. బాధితుడు బాపుతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు కిరణ్, అశోక్, శ్రావణ్, కృష్ణ, బీజేపీ నాయకులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, దేవాజీ, రాజు, వెంకటేశ్, విజయ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల సర్వేపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

జైపూర్: గృహలక్ష్మి దరఖాస్తుల ఎంపికలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించే సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో 20 మంది కార్యదర్శులకు వచ్చిన దరఖాస్తులు అప్పగించారు. లబ్ధిదారుల ఎంపిక సర్వేపై డీఆర్డీవో, గృహలక్ష్మి ప్రత్యేకాధికారి శేషాద్రి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.